సాక్షి
జోగుళాంబ గద్వాల
గురువారం । 25 । సెప్టెంబర్ । 2025



పాలమూరుకు క్రీడాకళ
జిల్లాకేంద్రంలోని మెయిన్ స్టేడియంలో గురువారం నుంచి రాష్ట్రస్థాయి సీనియర్ ఫుట్‌బాల్ పోటీలు నిర్వహించనున్నారు.
-IVలో ▸



చంద్రఘంటా.. పాహిమాం
నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా బుధవారం జోగుళాంబ అమ్మవారు చంద్రఘంటా దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు.
-IVలో ▸

గరిష్టం/కనిష్టం
32.1 /21.9

వాతావరణం
అప్పుడప్పుడు ఆకాశం మేఘావృతమై ఉంటుంది. అడపాదడపా మోస్తరు నుంచి భారీ వర్షం కురిసే అవకాశం ఉంది.

ఆగిన మగ్గం చప్పుడు!
చేనేత రంగంపై భారీ వర్షాల ప్రభావం

- మగ్గం గుంతల్లో రోజుల తరబడి నీరు చేరి పనులకు తీవ్ర ఆటంకం
- దసరా పండుగ ముందు కార్మికులకు దెబ్బ
- వర్షాల కారణంగా స్తంభించిన చేనేత కార్మికుల జీవనం

రాజోళి: నిత్యం చేతిలో పనితో హడావుడిగా ఉండే నేతన్నలు గత నెల రోజుల పైబడి పైసా పని లేక ఉసూరుమంటున్నారు. ఉదయం లేచింది మొదలు, నిత్యం దారాల అల్లికతో రంగుల కూర్పులతో, మగ్గం చప్పుళ్లతో సాగే చేనేత కార్మిక జీవనం వర్షపు చినుకుల మధ్య ముందుకు సాగలేక స్తంభిస్తుంది. చేనేత మగ్గాలు కావడంతో గుంతల్లో నీరు చేరి పనులు చేసేందుకు వీలులేక దినదినగండంగా గడుపుతున్నారు. గత నెలరోజులుగా కురుస్తున్న వర్షాలకు చేనేత కార్మికులు మరింతగా ఇబ్బందిపడుతున్నారు.

వర్షాకాలంలో సమస్య నిత్యకృత్యం..
గత నెలలో కురిసిన వర్షాల నుంచి బయటపడుతున్నామనుకులోగా మళ్లీ గత వారం రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా చేనేత కార్మికులు జీవనం నిలిచింది. జిల్లాలోని గద్వాల, అయిజ, గట్టు, రాజోళిలో ఎక్కువగా చేనేత కార్మికులు ఉన్నారు. వారంతా ఎక్కువగా చేతి మగ్గాలనే వాడుతున్నారు. దీని కోసం గుంతల ద్వారా మగ్గాలను ఏర్పాటు చేసుకుని ఉంటారు. ఇక వర్షాకాలం వచ్చిందంటే ఈ సమస్య నిత్యకృత్యమైంది. ప్రతి ఏడాది ఇలాంటి సమస్య ఉత్పన్నమవుతున్నా అధికారులు, నాయకులు పట్టించుకున్న పాపాన పోవడం లేదు. దీంతో కార్మికులు వర్షాకాలం వస్తే బిక్కుబిక్కుమంటూ తమ జీవనాన్ని వెల్లదీస్తున్నారు. జిల్లాలో చేనేత కార్మికులకు వర్షాకాలంలో ఇబ్బందులున్నప్పటికీ కొందరు కార్మికులు మరింత దుర్భర జీవితం గడుపుతున్నారు. గత నెలలో వర్షాలు జోరుగా కురవడంతో మగ్గాలు తడిసి పనులు నిలిచాయి. వాటి నుంచి బయటపడి పనులు చేసుకునేలోగా గత పది రోజులుగా వర్షాలు మళ్లీ కురుస్తుండటంతో కార్మికులు ఉపాధిని కోల్పోతున్నారు.


మగ్గం గుంతలో నీటిని తోడుతున్న కార్మికుడు

ఊట గుంతల్లా.. మగ్గం గుంతలు
రాజోళిలో చేనేత కార్మికుల పరిస్థితి మరింత అధ్వాన్నంగా ఉంది. కొత్త రాజోళిలో నివసిస్తున్న చేనేత కార్మికులు ఉదయం నుంచి రాత్రి దాకా నీరు ఎత్తిపోయడమే పనిగా పెట్టుకోవాల్సి వస్తుంది. కొత్త రాజోళిలో మొత్తం పునరావాస గృహాలే ఉన్నాయి. కాగా ఆ గృహాలు మొత్తం నల్ల భూమిలోనే నిర్మించారు. రెండు గదులతో నిర్మించిన ఈ గృహాల్లోనే కార్మికులు ఒక గదిలో మగ్గం గుంతను ఏర్పాటు చేసుకున్నారు. నల్ల భూమి కావడంతో నీరంతా గుంతల్లోకి చేరి నిల్వ ఉంటుంది. దీంతో నేసిన చీరలు, నేసేందుకు సిద్ధంగా ఉన్న మెటీరియల్ మొత్తం తడిసిపోయి రెండు రకాలుగా కార్మికులు నష్టపోతున్నారు. దీనికితోడు సరైన డ్రైనేజీలు కూడా లేకపోవడం, వర్షపు నీరు బయటకు వెళ్లే అవకాశం లేకపోవడంతో వృథా నీరంతా ఊట రూపంలో మగ్గం గుంతల్లోకి చేరుతుంది. గుంతల నిండా నీరు చేరడంతో చీరలు నేసేందుకు వీలు కావడం లేదు. మగ్గం కూడా మొత్తం తడిసిపోవడంతో వాటిని ఆరబెట్టేందుకు సమయం కావాలని, ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు అది కూడా వీలు కావడం లేదని ఆవేదన చెందుతున్నారు. ఇళ్ల మధ్య సీసీ రోడ్లు కూడా లేకపోవడంతో నీరు రోడ్లపైన, ఇళ్ల చుట్టుముట్టూ నీరు చేరి కార్మికులకు ఇబ్బందికరంగా మారుతుంది.


రాజోళిలో మగ్గం గుంతలో చేరిన వర్షపు నీరు

దెబ్బ మీద దెబ్బ
చేనేత కార్మికుల పరిస్థితి మూలిగే నక్క మీద తాటి కాయ పడిన చందంగా మారింది. అసలే కరెంట్ మగ్గాల ద్వారా నేసిన చీరలకు గిరాకీ పెరిగి, చేనేత చీరల అమ్మకాలు తగ్గడంతో నష్టాల్లో కొట్టుమిట్టాడుతున్నారు. ప్రస్తుతం దసరా పండుగ సీజన్ కావడంతో కార్మికులకు చేతి నిండా పనుంటుంది. ఆర్డర్లు ఎక్కువగానే తీసుకుంటారు. కానీ మగ్గం గుంతల్లో నీరు చేరడంతో పనులు నిలిచాయి. తడిచిన మగ్గం మెటీరియల్ ఆరి మళ్లీ పనులు మొదలుపెట్టాలంటే కనీసం రెండు రోజులు పడుతుంది. అంతలోగా వర్షం కురవకుంటే పర్లేదు కాని మళ్లీ వర్షం కురిస్తే పనులకు రోజుల తరబడి అంతరాయం కలుగుతుందని కార్మికులు అంటున్నారు. ఈ కారణంగా పండుగ సీజన్‌లో చీరల ఆర్డర్లు కోల్పోవడంతోపాటు.. ఇటు మెటీరియల్ పాడైపోయి.. పనుల్లేక పస్తులుండాల్సిన పరిస్థితి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి కరెంట్ మగ్గాలు అందించడంతోపాటు.. షెడ్లు నిర్మించేందుకు ఆర్థికంగా తోడ్పాటునందించాలని కోరుతున్నారు.

> **వర్షం వస్తే మొత్తం ఆగాల్సిందే**
>
> 
>
> వర్షం కురిసిందంటే మా మగ్గం మొత్తం తడిసిపోతుంది. దీంతో చీరలు నేయడం కదరదు. ఇప్పుడు మగ్గం గుంతల్లో నీరు నిలిచింది. ఆ నీటిని తోడుకునేందుకు సమయం సరిపోదు. ఎంత తోడినా ఊట గుంతలో మాదిరి నీరు వస్తూనే ఉంటాయి. అందులో వర్షం కురుస్తుండటంతో నీరు ఇంకా ఎక్కువగా చేరుతుంది. పది రోజులుగా పైసా పని లేకుండా కార్మికులం దుర్భర పరిస్థితి ఎదుర్కొంటున్నాం.
>
> – హేమలత, చేనేత కార్మికురాలు, రాజోళి

> **పండుగ ముందు కార్మికులకు నష్టమే**
>
> 
>
> ప్రస్తుతం దసరా పండుగ సీజన్ కావడంతో కార్మికులకు చేతి నిండా పనుటుంది. కానీ వర్షాలు కురవడంతో మగ్గం గుంతల్లోకి నీరు చేరింది. దీంతో పనులు నిలిచిపోయాయి. వర్షం నీరు చేరితే నీరు బయటకు వెళ్లి, మెటీరియల్ సెట్ అయ్యేందుకు రెండు రోజులు పడుతుంది. ఇలా వారంలో ఒక్కసారి వర్షం కురిసినా..పనులు నిలుస్తున్నాయి. అధికారులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసి కార్మికుల ఇబ్బందులను తొలగించాలి.
>
> – స్వాతి, చేనేత కార్మికురాలు రాజోళి

న్యూస్‌రీల్

ఆలయాల నిర్మాణానికి విరాళం



గద్వాలటౌన్/అలంపూర్: జిల్లా కేంద్రంలోని నల్లకుంట శివాలయ పునర్నిర్మాణం రూ.2కోట్ల వ్యయంతో చేపట్టగా.. కాలనీ ప్రజలతో పాటు సమీప కాలనీల భక్తుల నుంచి ఆలయ కమిటీ సభ్యులు విరాళాలను సేకరిస్తున్నారు. బీజేపీ రాష్ట్ర కార్యదర్శి, రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా అధ్యక్షుడు అయ్యపురెడ్డి రూ.2,51,116ను విరాళంగా అందజేశారు. వీరితో పాటు మరికొందరు ఆలయ నిర్మాణం కోసం విరాళాలు ఇచ్చారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ నిర్వాహకులు పులిపాటి వెంకటేష్, వెంకట్రాములు, గోపాల్, నల్లారెడ్డి, నాగరాజు శెట్టి, రాజు, బాలాజీ, బుచ్చన్న పాల్గొన్నారు.

జోగుళాంబ ఆలయానికి..
అలంపూర్ జోగుళాంబ ఆలయాలకు హైదరాబాద్‌కు చెందిన మహేష్‌కుమార్ రెడ్డి – రాధికా రెడ్డి దంపతులు రూ.లక్ష విరాళం అందజేసినట్లు ఈఓ దీప్తి తెలిపారు. ఈ సందర్భంగా వారు జోగుళాంబ, బాలబ్రహ్మేశ్వర స్వామి వారి ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ అధికారులు శేషవస్త్రాలతో వారిని సత్కరించారు. అర్చక స్వాములు వారికి తీర్థ ప్రసాదాలను అందజేసి ఆశీర్వచనం పలికారు. వీరితోపాటు ఆలయ అధికారులు ఉన్నారు.

వేరుశనగ క్వింటా రూ.4,321

గద్వాల వ్యవసాయం: గద్వాల మార్కెట్ యార్డుకు సోమవారం 79 క్వింటాళ్ల వేరుశనగ వచ్చింది. గరిష్టం రూ.4321, కనిష్టం రూ.2720, సరాసరి రూ. 3821 ధరలు లభించాయి. అలాగే, 107 క్వింటాళ్ల ఆముదాలు రాగా.. గరిష్టం రూ. 5930, కనిష్టం రూ. 5792, సరాసరి రూ. 5930 ధరలు పలికాయి.

ఉద్యోగ అవకాశాలు కల్పించేస్థాయికి ఎదగాలి

వనపర్తిటౌన్: ఇంజినీరింగ్ విద్యార్థులు ఉద్యోగం కోసం వెదుక్కోకుండా ఉద్యోగ అవకాశాలు కల్పించే స్థాయికి ఎదగాలని స్థానిక జేఎన్‌టీయూ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఎన్‌వీఎస్ రాజు ఆకాంక్షించారు. బుధవారం కళాశాలలో డీసీ-ఎంఎస్ఎంఈ, న్యూఢిల్లీ సహకారంతో ఎంట్రప్రెన్యూర్‌షిప్‌పై అవగాహన సదస్సు నిర్వహించగా ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థులు పరిజ్ఞానాన్ని పెంపొందించుకొని దేశాభివృద్ధికి పాటుపడాలని కోరారు. ఆలోచన ఉంటే సరిపోదని.. కృషి, పట్టుదల, నమ్మకం ఉండాలని, అన్ని ఉంటేనే జీవితంలో, సమాజంలో రాణించగలమన్నారు. ఎస్ఐసీ -టీఎస్పీ డిప్యూటీ మేనేజర్ అబ్దుల్ ఖాదర్ ఎంట్రప్రెన్యూర్‌షిప్, స్టార్టప్‌లపై అవగాహన కల్పించారు. వైస్ ప్రిన్సిపాల్ బీవీ రాంనరేష్ పాల్గొన్నారు.

26న ఉద్యోగమేళా

కందనూలు: జిల్లా కేంద్రంలోని నేషనల్ ఐటీఐ కళాశాలలో 26న ఉద్యోగమేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి కల్పనశాఖ అధికారి రాఘవేందర్‌సింగ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీరామ లైఫ్ ఇన్సూరెన్స్ ద్వారా 50 ఉద్యోగాల భర్తీకి మేళా కొనసాగుతుందన్నారు. పదో తరగతి అర్హత కలిగి 25 నుంచి 32 ఏళ్ల వయస్సు కలిగిన అభ్యర్థులు ఉదయం 10 గంటలకు హాజరు కావాలని సూచించారు. వివరాలకు 95051 86201, 96669 74704 నంబర్లను సంప్రదించాలని కోరారు.



అక్టోబర్ 22 నుంచి కురుమూర్తిస్వామి జాతర

- బ్రహ్మోత్సవాలకు పకడ్బందీగా ఏర్పాటు
- భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు
- శాఖల వారీగా ప్రత్యేకంగా కమిటీల నియామకం
- కోఆర్డినేషన్ సమావేశంలో కలెక్టర్ విజయేందిర బోయి

- జెడ్పీ సెంటర్ (మహబూబ్‌నగర్)

- వివరాలు IVలో

● అప్పుడు.. ఇప్పుడూ..

పాలమూరు చుట్టే రాజకీయం!



- పీఆర్ఎల్ఐ కేంద్రంగా పాలి'ట్రిక్స్'
- పాలక, ప్రతిపక్షాల పోటాపోటీ విమర్శలు
- 90% పనుల పూర్తి.. మిగిలిన 10% పూర్తి చేయాలి..
- ఇదే డిమాండ్‌తో పోరుబాటకు బీఆర్ఎస్ సన్నాహాలు
- దీటుగా స్పందించేలా కాంగ్రెస్ కార్యాచరణ
- 'స్థానిక' ఎన్నికల వేళ రాజుకున్న వేడి

సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో రాజకీయ సెగ రాజేసింది.. తెలంగాణ మలి దశ పోరులో రణనినాదమై నిలిచింది పాలమూరే. తలాపున కృష్ణమ్మ ఉన్నా.. సాగు, తాగునీరు లేక వలసలతో తండ్లాడిన ఇక్కడి ప్రజల దీనగాధ, వెనుకబాటుతనమే ప్రతి ఒక్కరి గళమైంది. ప్రత్యేక రాష్ట్ర సాధన ఉద్యమానికి ఊపిరిలూదింది. తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించి బీఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పాటైనా, ఆ తర్వాత కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినా 'పాలమూరు'దే కీలక భూమిక. అలాంటి ఈ ప్రాంతాన్ని సస్యశ్యామలం చేసే పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్ట్ పనులు పదేళ్లుగా కొనసాగుతూనే ఉన్నాయి. తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించిన తర్వాత 2015లో ఈ ఎత్తిపోతలకు అడుగులు పడగా.. అప్పుడు, ఇప్పుడూ దీని చుట్టే రాజకీయాలు తిరుగుతున్నాయి. అధికార, విపక్ష నేతలకు పాలమూరు ప్రచారాస్త్రంగా మారగా.. రైతాంగానికి మాత్రం సాగునీటి కోసం ఎదురుచూపులు తప్పడం లేదు.

తొలి నుంచీ రాజకీయాస్త్రమే..

కృష్ణానదిలో శ్రీశైలం బ్యాక్ వాటర్ ఆధారంగా రోజుకు 1.5 టీఎంసీల చొప్పున 60 రోజుల్లో 90 టీఎంసీల నీటిని ఎత్తిపోసేలా పీఆర్ఎల్ఐ పథకానికి అప్పటి బీఆర్ఎస్ (టీఆర్ఎస్) ప్రభుత్వం రూపకల్పన చేసింది. ఉమ్మడి మహబూబ్‌నగర్, రంగారెడ్డి, నల్లగొండ జిల్లాల పరిధిలో 12.30 లక్షల ఎకరాలకు సాగు, 1,226 గ్రామాలకు తాగు నీరందించాలనే లక్ష్యంతో ఈ పథకానికి శ్రీకారం చుట్టింది. 2016లో భూత్పూర్ మండలం కరివెన రిజర్వాయర్ వద్ద అప్పటి సీఎం కేసీఆర్ పనులను ప్రారంభించారు. పర్యావరణ, ఇతర అనుమతులు, కేసులతో ప్రాజెక్ట్ నిర్మాణానికి అడ్డంకులు ఎదురుకాగా.. ప్రధానంగా బీఆర్ఎస్, కాంగ్రెస్ మధ్య పొలిటికల్ వార్ నడిచింది. ఈ క్రమంలో ఎన్నికల ముందు 2023 సెప్టెంబర్‌లో నార్లపూర్ పంప్‌హౌస్ వద్ద కేసీఆర్ మోటార్ స్విచ్ ఆన్‌చేసి ప్రారంభించారు. ప్రాజెక్ట్ పూర్తికాకముందే ప్రారంభోత్సవమా అంటూ కాంగ్రెస్ నేతలు చేపట్టిన రిజర్వాయర్ల సందర్శన రాజకీయాలను వేడెక్కించాయి.

బీఆర్ఎస్ ప్రాజెక్ట్ బాట సన్నాహాలతో మళ్లీ..

రాష్ట్రంలో మూడో పర్యాయం 2023 డిసెంబర్‌లో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో అధికారం తారుమారైంది. కాంగ్రెస్ అధికారంలోకి రాగా.. బీఆర్ఎస్ ప్రతిపక్ష స్థానానికి పరిమితమైంది. ఈ క్రమంలో బీఆర్ఎస్ నాయకులు ఇటీవల పాలమూరు ప్రాజెక్ట్‌పై గళం పెంచారు. తాము 90 శాతం ప్రాజెక్ట్ పనులు పూర్తి చేశామని.. మిగిలిన పది శాతం పనులను పూర్తి చేయాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రులు శ్రీనివాస్‌గౌడ్, నిరంజన్‌రెడ్డి తదితర నాయకులు ఇటీవల గద్వాలలో జరిగిన సభలో, విలేకరుల సమావేశాల్లో డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లోని శ్రీనివాస్‌గౌడ్ ఇంట్లో ఉమ్మడి మహబూబ్‌నగర జిల్లాలోని మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్యేలు ఇతర నేతలు సమావేశమయ్యారు. పాలమూరు ప్రాజెక్ట్ పనుల్లో వేగం పెంచి.. త్వరగా ఎత్తపోతలు చేపట్టేలా కాంగ్రెస్‌పై ఒత్తిడి పెంచాలని నిర్ణయించారు. ప్రాజెక్ట్‌లో భాగమైన అన్ని రిజర్వాయర్లను చుట్టేలా పాదయాత్ర లేదంటే బస్సు యాత్ర చేపట్టే కార్యాచరణపై సమాలోచనలు చేయగా.. రాజకీయ వేడి మళ్లీ రాజుకున్నట్లు తెలుస్తోంది.

పోటాపోటీగా కాంగ్రెస్..

పాలమూరు ప్రాజెక్ట్‌కు సంబంధించి బీఆర్ఎస్ హయాంలో 90 శాతం కాదు.. అసలైన పనులే వదిలేశారని పోటాపోటీగా బీఆర్ఎస్ నేతలపై కాంగ్రెస్ నాయకులు విమర్శలు గుప్పిస్తున్నారు. ఇందులో భాగంగానే దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి మంగళవారం కరివెన రిజర్వాయర్ వద్ద అధికారులతో సమీక్ష, విలేకరుల సమావేశం నిర్వహించినట్లు రాజకీయ వర్గాలు అంచనా వేస్తున్నాయి. మూడేళ్లలో ప్రాజెక్ట్ పూర్తి చేస్తామని హామీ ఇచ్చి నెలబెట్టుకోలేక పోయారని.. ప్రధాన కాల్వ నిర్మించకుండా నీరెలా పారిస్తారని అనుకున్నారు అంటూ ఆయన ప్రశ్నించారు. దీనికి అప్పట్లోనే భూసేకరణ చేసి ఉంటే.. వ్యయం పెరిగేది కాదని.. ప్రస్తుతం సమస్య ఉత్పన్నమయ్యేది కాదని.. గత పాలకుల నిర్లక్ష్యంతోనే ప్రాజెక్ట్ పనులు అసంపూర్తిగా మిగిలాయని ధ్వజమెత్తారు. అంతేకాదు.. బీఆర్ఎస్ యాత్ర చేపడితే దీటుగా స్పందించేలా కాంగ్రెస్ ముందుకుసాగుతున్నట్లు ఆయన మాటలను బట్టి తెలుస్తోంది. త్వరలో స్థానిక ఎన్నికలు జరగనుండగా.. స్థానిక సమస్యలతో పాటు పాలమూరు ప్రాజెక్ట్ అంశం ఇరు పార్టీలకు మళ్లీ ప్రచారాస్త్రంగా మారనున్నట్లు రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

ఆలయాల్లో ఆధ్యాత్మిక శోభ


జములమ్మ ఆలయంలో గజలక్ష్మిదేవి అలంకరణలో అమ్మవారు


విశేష పూజలు అందుకుంటున్న దుర్గామాత

- వైభవంగా దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు
- వివిధ రూపాల్లో అమ్మవారి దర్శనం

గద్వాలటౌన్: ఆది పరాశక్తి... ఆశ్రిత పక్షపాతి అమ్మవారిని కొలిచేందుకు భక్తులు బారులు తీరారు. అమ్మవారి శరన్నవరాత్రి మహోత్సవ వేడుకలను పట్టణంలోని పలు ఆలయాలలో అత్యంత వైభంగా చేపట్టారు. మూలప్రతిమలు, ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరించారు. విశేష పూజలు, అభిషేకాలు చేశారు. నవరాత్రి ఉత్సవాలలో భాగంగా మూడవ రోజు బుధవారం అమ్మవారు వివిధ రూపాల్లో దర్శనమిచ్చారు. నీ చల్లని చూపులు మాపై ఉండాలంటూ భక్తులు ప్రణమిల్లారు. సాయంత్రం పలు చోట్ల భక్తిగీతాలపన, నృత్య ప్రదర్శనలు, కచేరీలు, అధ్యాత్మిక ప్రవచనాలు చేశారు. స్థానిక కన్యకాపరమేశ్వరి ఆలయంలో అమ్మవారు శ్రీ రాజరాజేశ్వరి అలంకరణ.. గద్వాల ఇలవేల్పు జములమ్మ ఆలయంలో అమ్మవారు గజలక్ష్మిదేవి అలంకరణలో దర్శనమిచ్చి భక్తులకు దర్శనమిచ్చారు. అలాగే, స్థానిక తాయమ్మ ఆలయంలో, కుమ్మరివీధిలో, అంబాభవాని దేవాలయంలో, వీరభద్రస్వామి ఆలయంలో, మార్కెండేయస్వామి ఆలయంలో అమ్మవారు వివిధ రూపాల అలంకరణలో దర్శనమిచ్చారు. బాలాజీవీధులలో ప్రతిష్ఠించిన దుర్గామాత విగ్రహాలకు ప్రత్యేక పూజలు, కుంకుమార్చనలు చేపట్టారు. స్థానిక కోటలోని చెన్నకేశవస్వామి ఆలయంలో స్వామివారి ఉత్సవ విగ్రహాలను వాహనంపై ఊరేగించారు. భక్తులతో ఆలయ ప్రాంగణాలు కిటకిటలాడాయి.

పండ్ల తోటలను సంరక్షించుకోవాలి


బి.తిమ్మాపూర్ శివారులో బత్తాయి మొక్కలను పరిశీలిస్తున్న జిల్లా అధికారి ఎండీ అక్బర్

అయిజ: పండ్ల తోటలను అనేక చీడపీడలు ఆశిస్తాయని, రైతులు ఎప్పటికప్పుడు గమనిస్తూ పండ్లతోటలను సంరక్షించుకోవాలని హార్టికల్చర్ జిల్లా అధికారి ఎండీ అక్బర్ అన్నారు. బుధవారం మండలంలోని తుపత్రాల, బి.తిమ్మాపూర్, దేవబడ శివార్లలో బత్తాయి, దానిమ్మ, ఆయిల్ పాం తోటలను పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పండ్ల తోటలను జిల్లాలో ఈ ఏడాది ఎక్కువ మంది రైతులు ఎక్కువ విస్తీర్ణంలో సాగుచేశరని, మొక్కలు నాటిన సంవత్సరం వరకు అనేక రకాల పురుగులు, తెగుళ్ల ఆశించే అవకాశం ఉంటుందని అన్నారు. మొక్కలకు ఎప్పటికప్పుడు పురుగుమందులను పిచికారీ చేయాలని సూచించారు. సూక్ష్మదాతువు పోషకాల లోపాలు మొక్కల్లో కనిపిస్తే ఆకులు రంగుమారుతాయన, గిడుసబారిపోతాయని, మెక్కల ఎదుగుదల లోపిస్తుందని వివరించారు. వాటిలోపాన్ని భర్తి చేసేందుకు ఫార్ముల4 లేక ఫార్ముల 6ను ఎంపిక చేసుకొని మొక్కలపై పిచిచారి చేయాలని, లేదా ఎరువుతో పాటు కలిపి మొక్కల వేర్లకు అందేలా చేయాలని రైతులకు పలు సలహాలు సూచనలు చేశారు. కార్యక్రమంలో హార్టికల్చర్ అధికారి మహేష్, వివిధ గ్రామాల రైతులు పాల్గొన్నారు.



అబ్బురం.. అమ్మవారి రూపం

ఉండవెల్లి మండలంలోని జోగుళాంబ రైల్వే హాల్ట్ గోడలపై చిత్రించిన అమ్మవారి రూపాలు ప్రయాణికులను అబ్బురపరుస్తున్నాయి. దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల నేపథ్యంలో అమ్మవారి రూపాలను గోడలపై వేయించారు. దీంతో రాష్ట్ర నలుమూలల నుంచి రైలు మార్గం గుండా అలంపూర్ జోగుళాంబ ఆలయానికి వచ్చే భక్తులను చిత్రాలు ఎంతో ఆకట్టుకుంటున్నాయి. - ఉండవెల్లి

సరిహద్దు ప్రాంతాల్లో అప్రమత్తంగా ఉండాలి


ఆయుధాలను పరిశీలించి పోలీసు సిబ్బందితో వివరాలు తెలుసుకుంటున్న ఎస్పీ శ్రీనివాసరావు

కేటీదొడ్డి: సరిహద్దు చెక్‌పోస్టుల్లో అప్రమత్తంగా ఉండాలని, అక్రమ రవాణాకు ఎట్టి పరిస్థితుల్లోనూ అవకాశం ఉండకూడదని ఎస్పీ శ్రీనివాసరావు అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌ను డీఎస్పీ మొగులయ్యతో కలిసి ఎస్పీ సందర్శించారు.పోలీసులకు పలు సూచనలు, సలహాలు చేశారు. శాంతిభద్రలలకు సంబంధించిన సమాచారాన్ని అడిగి తెలుసుకున్నారు. అలాగే వివిధ రికార్డులను, యూనిఫాం టర్న్ ఔట్, స్టేషన్ పరిసరాలను పరిశీలించారు. ముఖ్యంగా రౌడీ షీటర్స్, అనుమానితులపై నిఘా ఉంచడంతో పాటు గ్రామాల్లోని ఎలాంటి సమాచారం అయినా తెలుసుకుని ఉండాలని సూచించారు. స్టేషన్ ఆవరణలో స్వాధీనం చేసుకున్న వాహనాల వివరాలను తెలుసుకున్నారు. కేసులు పెండింగ్ లేకుండా చూడడంతో పాటు ఎప్పటి కప్పుడు గ్రామాల్లో గస్తీ నిర్వహించి క్రైం రేటును తగ్గించాలన్నారు. ఫ్రెండ్లీ పోలీస్ అమలు చేయాలని, పోలీసు శాఖకు మంచి పేరు తీసుకువచ్చే విధంగా ఒకే చోటు పని చేసే ఉద్యోగులు అన్నదమ్ముల్లా కలిసి మెలిసి ఉండాలన్నారు. కార్యక్రమంలో సీఐ టంగుటూరి శ్రీను, ఎస్సై శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ఆకతాయిలపై ప్రత్యేక నజర్



రౌడీషీటర్లతో మాట్లాడుతున్న పట్టణ ఎస్‌ఐ కళ్యాణ్‌కుమార్ (ఫైల్)

- కేసుల నమోదు.. రిమాండ్‌కు తరలింపు
- పరారీలో పలువురు నిందితులు
- ముమ్మరంగా గాలింపు
- స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో పటిష్ట చర్యలు

గద్వాల క్రైం: అల్లర్లకు పాల్పడుతూ శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తున్న ఆకతాయిలపై పోలీసులు ప్రత్యేక నజర్ పెట్టారు. గతంలో కేసులు నమోదై పోలీసు రికార్డులో ఉన్న రౌడీలను అదుపులోకి తీసుకుని బెండు తీసే పనిలో జోగుళాంబ గద్వాల జిల్లా పోలీసుశాఖ నిమగ్నమైంది. మద్యం మత్తు, అకారణంగా ఇతరులపై దాడులకు తెగబడుతున్న నిందితులను అదుపులోకి తీసుకుని కోర్టులో హాజరుపర్చి రిమాండ్‌కు తరలిస్తున్న తాజా ఘటనలపై ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గద్వాల–అలంపూర్ సెగ్మెంట్‌లో గడచిన 15 రోజుల వ్యవధిలో 10మంది ఆకతాయిలు అరెస్ట్ చేసి మహబూబ్‌నగర్ జిల్లా జైలులో రిమాండ్ ఖైదీలుగా ఉంచారు. పరారీలో ఉన్న మరి కొంతమంది ఆకతాయిల కోసం గాలింపు చర్యలు ముమ్మరం చేశారు. జిల్లావ్యాప్తంగా అన్ని పోలీస్‌స్టేషన్ల పరిధిలో నమోదైన రౌడీషీటర్లు, అనుమానిత వ్యక్తుల వివరాల గురించి ఆరా తీస్తున్నారు. మరోవైపు ప్రభుత్వం త్వరలో స్థానిక ఎన్నికలను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్న నేపథ్యంలో గ్రామాల్లో అవాంఛనీయ ఘటనలు జరగకుండా పటిష్ట చర్యలు తీసుకుంటున్నారు.

సరిహద్దు ప్రాంతం కావడంతో..

జిల్లా రెండు రాష్ట్రాలతో సరిహద్దు పంచుకోవడంతో అల్లర్లు, హింసత్మక దాడులకు పాల్పడే నిందితులు తప్పించుకునేందుకు సులువుగా ఉంటుంది. మరోవైపు జిల్లాకు రైలు, రోడ్డు మార్గం ఉండడంతో ఇతర రాష్ట్రాలకు పారిపోతున్నారు. ఈ క్రమంలో బాధితులు తమపై జరిగిన దాడులపై పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పాటు ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకొస్తున్నారు. దీంతో పోలీసు శాఖ అప్రమత్తమై నిందితులను గుర్తించి అరెస్ట్ చేస్తున్నారు. అయితే కేసుల్లోంచి తప్పించుకునేందుకు కొందరు రాజకీయ నాయకులను ఆశ్రయిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

నిషేధిత మత్తు పదార్థాల కట్టడి

జిల్లా పరిధిలో నిషేధిత మత్తు పదార్థాల విక్రయాలు కలవర పెడుతున్నాయి. ఇటీవల గట్టు మండలంలోని బోయలగూడెం శివారులో గుట్టుగా గంజాయి సాగు చేస్తున్నట్లు పోలీసులు గుర్తించి వాటిని స్వాధీనం చేసుకున్నారు. గంజాయి సాగు చేస్తున్న వారిలో యువతే ఉండడం ఆందోళన కలిగిస్తోంది. మద్యం ధరలు అధికంగా ఉండడంతో కిక్కు కోసం యువత తక్కువ ధరకు దొరికే గంజాయికి బానిసలవుతున్నారు. నిషేధిత మత్తు పదార్థాల నిషేధానికి పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నిరంతరం అవగాహన కల్పిస్తున్నా.. ఆశించిన స్థాయిలో ఫలితం ఉండట్లేదు. పోలీసులు గంజాయి విక్రయిస్తున్న నిందితులను అదుపులోకి తీసుకుని.. వారి నుంచి గంజాయి కొనుగోలు చేస్తున్న వారి వివరాలను తెలుసుకోగా ఎక్కువ సంఖ్యలో యువతే ఉండడం విస్మయానికి గురి చేస్తోంది. వారికి తల్లిదండ్రుల సమక్షంలో కౌన్సిలింగ్ అందించారు. గంజాయి విక్రయించిన వారిని రిమాండ్‌కు తరలించారు.

తలనొప్పిగా మారిన నేతల ఒత్తిళ్లు

జిల్లాలో 20 రోజుల క్రితం జరిగిన హింసాత్మక ఘటనలో పోలీసులు కేసులు నమోదు చేశారు. దీంతో నిందితులు తమ వర్గానికి చెందిన వారు వదిలేయండి అంటూ.. ఓ వైపు మంత్రి, ఎంపీల నుంచి ఒత్తిళ్లు రావడంతో పోలీసులు మౌనం పాటించాల్సి వచ్చింది. అయితే స్థానికంగా బలమైన నాయకుడు నిందితులను శిక్షించాలని కోరడంతో పోలీసులు చట్టప్రకారం చర్యలు చేపట్టారు. ఆకతాయిలపై కఠినంగా వ్యవహరిస్తున్న పోలీసులకు ప్రజల నుంచి హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.



కఠినంగా వ్యవహరిస్తాం



జిల్లాలో శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే సహించేది లేదు. హింసాత్మక దాడులు, అల్లర్లకు పాల్పడిన వారు ఎవరైనా ఉపేక్షించం. మద్యం, నిషేధిత మత్తు పదార్థాలకు యువత ఆకర్షితులవడం ఆందోళన కలిగిస్తోంది. వారి భవిష్యత్ దృష్టిలో ఉంచుకుని పట్టు బడిన యువతకు కౌన్సిలింగ్ అందిస్తున్నాం. మత్తు పదార్థాల వల్లన జరిగే నష్టాల గురించి వివరిస్తున్నాం. గంజాయి విక్రయాలపై ఉక్కుపాదం మోపుతున్నాం. క్రయ, విక్రయాలకు పాల్పడిన వ్యక్తులపై కేసులు నమోదు చేసి జైలుకు పంపుతున్నాం. పాత నేరస్తులు, రౌడీషీటర్ల వివరాలను గుర్తించి బైండోవర్ చేస్తున్నాం.

– శ్రీనివాసరావు, ఎస్పీ

క్లుప్తంగా

అనుమానాస్పద మృతిపై కేసు నమోదు

గోపాల్‌పేట: రేవల్లి మండలంలోని నాగపూర్‌కు చెందిన కల్మూరి ఈదన్న(68) మృతి అనుమానాస్పదంగా ఉందని అతని కూతురు ఫిర్యాదు మేరకు బుధవారం కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించామని రేవల్లి ఎస్‌ఐ రజిత తెలిపారు. ఎస్‌ఐ కథనం ప్రకారం.. నాగపూర్‌కు చెందిన కల్మూరి ఈదన్నకు ముగ్గురు కూతుర్లు, ఒక కుమారుడు. తన భార్య 2023లో మృతిచెందగా.. కుమారుడు, పెద్దకూతురు కొన్నాళ్ల కిందట చనిపోయారు. మంగళవారం మధ్యాహ్నం ఈదన్న పెద్దకూతురు అత్తగారి ఊరైన చెన్నారంలోని ఇంటివద్ద మృతిచెందాడు. అంత్యక్రియలు నిర్వహించేందుకు నాగపూర్‌కు మంగళవారం తీసుకెళ్లారు. ఈదన్న చిన్న కూతురు స్వప్న తన తండ్రి మృతిపై అనుమానం ఉందని రేవల్లి పోలీస్‌స్టేషన్‌లో బుధవారం ఫిర్యాదు చేసింది. ఈ మేర కు కేసు నమోదు చేసి ఈదన్న మృతదేహానికి నాగర్‌కర్నూల్ ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించామని వివరించారు.

అనుమానాస్పదంగా వ్యక్తి మృతి

మన్ననూర్: అమ్రాబాద్ మండలం వెంకటేశ్వర్ల బావి గేటు సమీపంలో అనుమానాస్పదంగా వ్యక్తి మృతిచెందిన ఘటన బుధవారం రాత్రి చోటు చేసుకున్నది. పోలీసు కథనం ప్రకారం.. పదర మండల కేంద్రానికి చెందిన నల్లపోతుల వెంకటేశ్(25) వ్యక్తిగత పనినిమిత్తం బైక్‌పై అచ్చంపేటకు వెళ్లి తిరిగి వస్తుండగా వెంకటేశ్వర్లబావి గేటు సమీపంలో మృతిచెంది పడి ఉన్నాడు. అమ్రాబాద్ ఎస్‌ఐ గిరిమనోహర్‌రెడ్డి సమక్షంలో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి మృతదేహాన్ని అమ్రాబాద్ ఆస్పత్రికి తరలించారు. బైక్‌కు సంబంధించిన శిథిలాలు(డూమ్‌లు, సైడ్ లైట్లు, క్లచ్ లివర్లు) ఘటనా స్థలంలో పడి ఉండగా.. బైక్ కనిపించక పోవడం గమనార్హం. ఘటనపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. వెంకటేశ్‌కు భార్య చిట్టెమ్మ, కుటుంబ సభ్యులు ఉన్నారు.

విధుల్లో ఉండగా.. తహసీల్దార్‌కు గుండెపోటు

మిడ్జిల్: మండల తహసీల్దార్ యూపీ రాజుకు బుధవారం ఉదయం తహసీల్దార్ కార్యాలయంలో గుండెనొప్పి రావడంతో పక్కనే ఉన్న సిబ్బంది వెంటనే హైదరాబాద్‌కు తరలించారు. ప్రస్తుతం హైదరాబాద్‌లోని ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నట్లు కార్యాలయం సిబ్బంది తెలిపారు. తహసీల్దార్ త్వరగా కోలుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

మహిళపై దాడి.. కేసు నమోదు

ఉండవెల్లి: మండల కేంద్రంలో మహిళపై దాడి ఘటనలో కేసు నమోదైనట్లు ఎస్‌ఐ శేఖర్ తెలిపారు. మండల కేంద్రంలో నివాసముంటున్న భార్యాభర్తలైన మధుబాబు, మేరమ్మకు మంగళవారం రాత్రి ఘర్షణ తలెత్తింది. ఈ క్రమంలో మేరమ్మ తన కు టుంబ సభ్యులతో భర్తపై దాడి చేయిస్తుండగా చిన్న మ్మ వరుసైన ఈశ్వరమ్మ అడ్డుపడింది. ఈ నేపథ్యంలో మేరమ్మ బంధువులు అందరూ కలిసి మధుబాబు, ఈశ్వరమ్మపై దాడి చేశారు. దాడిలో ఈశ్వరమ్మను మేరమ్మ రాయితో దాడి చేయడంతో తలకు రక్త గాయాలైనట్లు తెలిపారు. ఈశ్వరమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

దాడి ఘటనలో ఫిర్యాదు

ఉండవెల్లి: స్థల వివాదంలో ఇంటి మీదకు వచ్చి దాడికి ప్రయత్నించిన నేపథ్యంలో దాడి కేసు నమోదైనట్లు ఎస్‌ఐ శేఖర్ బుధవారం తెలిపారు. మండల కేంద్రంలో నివాసముంటున్న కురువ సత్యానారాయ ణ అనే వ్యక్తికి 352 సర్వే నంబర్‌లో 1. 13 కుంటల భూమి ఉందని ఈ విషయంలో కురువ స్వాములు పేరు మీద ఉన్నట్లు కేసు నడుస్తున్నాయన్నారు. ఈ నేపథ్యంలో మంగళవారం రాత్రి తన ఇంటి మీదుకి బీరు సీసాతో వచ్చి కురువ స్వాములు దాడికి య త్నించాడని కురువ సత్యానారాయణ ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు.

తాళంవేసిన ఇంట్లో చోరీ: కేసునమోదు

మదనాపురం: మండలకేంద్రంలోని తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ అయిన ఘటన చోటు చేసుకున్నది. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన వడ్డె రవికిరణ్ మంగళవారం పని నిమిత్తం మహబూబ్‌నగర్‌కు వెళ్లాడు. ఇంట్లో ఉన్న రవికిరణ్ తండ్రి చంద్రయ్య తాళం వేసి మదనాపురంలో ఉన్న తన పెద్దకుమారుడు ఇంట్లో రాత్రి అక్కడే ఉన్నారు. బుధవారం ఉదయం తిరిగి వచ్చి చూసేసరికి తాళం పగులగొట్టి బీరువా తెరిచి, అందులోని రెండున్నర తులాల బంగారు ఆభరణాలు, వెండి వస్తువులు, రూ.32,500 నగదు దొంగిలించారు. ఇంటి యజమాని ఫిర్యాదు మేరకు ఆత్మకూర్ సీఐ శివకుమార్ ఆదేశాల మేరకు ఎస్సై శేఖర్‌రెడ్డి కేసు నమోదు చేసి, క్లూస్‌టీమ్, డాగ్‌స్క్వాడ్‌తో సంఘటనా స్థలాన్ని పరిశీలించి వేలిముద్రలు సేకరించారు. దొంగల కోసం గాలింపుచర్యలు చేపట్టారు. త్వరలో దొంగలను పట్టుకుంటామని పోలీసులు తెలిపారు. మండల ప్రజలు రాత్రివేళల్లో ఇంటివద్ద జాగ్రత్తలు పాటించాలన్నారు.



జూరాలకు నిలకడగా వరద



జూరాల నుంచి 32 క్రస్టు గేట్ల ద్వారా దిగువకు విడుదలవుతున్న వరద నీరు

- ప్రాజెక్టుకు 2లక్షల 55వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో
- 32గేట్లు ఎత్తి 2లక్షల 51వేల 422క్యూసెక్కుల విడుదల
- జల విద్యుత్ కేంద్రంలో కొనసాగుతున్న విద్యుదుత్పత్తి

ధరూరు: కర్ణాటక, మహారాష్ట్రలో కురిసిన భారీ వర్షాలతో ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు ఎగువ నుంచి వస్తున్న ఇన్‌ఫ్లో స్వల్పంగా తగ్గినట్లు పీజేపీ అధికారులు తెలిపారు. మంగళవారం రాత్రి 8గంటల వరకు ప్రాజెక్టుకు 3లక్షల 32వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా.. బుధవారం రాత్రి 9 గంటల వరకు ప్రాజెక్టుకు వస్తున్న ఇన్‌ఫ్లోలు 2లక్షల 55వేల క్యూ సెక్కులకు తగ్గినట్లు పీజేపీ అధికారులు తెలిపారు. దీంతో ప్రాజెక్టు 32 క్రస్టు గేట్లను ఎత్తి గేట్ల ద్వారా 2లక్షల 21వేల 120 క్యూసెక్కుల వరద నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. జెన్‌కో జల విద్యుత్ కేంద్రంలో ఆరు యూనిట్లలో విద్యుదుత్పత్తిని కొనసాగిస్తున్నట్లు అధికారులు తెలిపారు. విద్యుదుత్పత్తి నిమిత్తం 27వేల 927 క్యూసెక్కులు, నెట్టెంపాడుకు 750 క్యూసెక్కులు, ఆవిరి రూపంలో 45 క్యూసెక్కులు, ఎడమ కాల్వకు 1,030 క్యూసెక్కులు, కుడి కాల్వకు 550 క్యూసెక్కులు, భీమా లిఫ్టు–2కు 750 క్యూసెక్కులు ప్రాజెక్టు నుంచి మొత్తం 2లక్షల 51వేల 422 క్యూసెక్కుల నీటిని దిగువనున్న శ్రీశైలం ప్రాజెక్టుకు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 9.657 టీఎంసీలు కాగా ప్రస్తుతం ప్రాజెక్టులో 8.377 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు పీజేపీ అధికారులు తెలిపారు. ఇదిలా ఉండగా.. ఆల్మట్టి ప్రాజెక్టుకు పూర్తిస్థాయి నీటిమట్టం 129.72 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం ఈ ప్రాజె క్టులో పూర్తిస్థాయిలో 126.73 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ప్రాజెక్టుకు 37,098 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా.. ప్రాజెక్టు నుంచి దిగువన ఉన్న నారాయణపూర్ ప్రాజెక్టుకు 39వేల 135 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. నారాయణపూర్ ప్రాజెక్టుకు పూ ర్తిస్థాయి నీటిమట్టం 37.64 టీఎంసీలు కాగా.. ప్రస్తు తం ఈ ప్రాజెక్టులో 37.51 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ప్రాజెక్టుకు 46వేల 167 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా.. దిగువనున్న జూరాలకు ప్రాజెక్టుకు లక్షా 45,075 క్యూసెక్కుల నీటిని దగువకు విడుదల చేస్తున్నారు.

732.426 ఎంయూ విద్యుదుత్పత్తి

ఆత్మకూర్: జూరాలకు ఎగువ నుంచి వరదనీరు భారీగా చేరుతుండడంతో జలవిద్యుదుత్పత్తి కేంద్రాల్లో ఆరు యూనిట్లలో విద్యుదుత్పత్తి కొనసాగుతుంది. ఈ మేరకు బుధవారం 6 యూనిట్ల ద్వారా విద్యుదుత్పత్తిని చేపట్టినట్లు ఎస్‌ఈ శ్రీధర్ తెలిపారు. ఎగువలో 6 యూనిట్ల ద్వారా 234 మెగావాట్లు, 361.564 ఎంయూ విద్యుదుత్పత్తిని చేపడుతున్నారు. ఎగువ, దిగువ జలవిద్యుత్ ఉత్ప త్తి కేంద్రాల్లో ఇప్పటివరకు 732.426 మిలియన్ యూనిట్లను విజయవంతంగా చేపట్టామన్నారు.

సుంకేసులకు 25వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో


రాజోళి: సుంకేసుల డ్యాంకు బుధవారం ఇన్‌ఫ్లో వచ్చి చేరుతున్నట్లు జేఈ మహేంద్ర తెలిపారు. ఎగువ నుంచి 25,350 క్యూసెక్కులు ఇన్‌ఫ్లో రాగా.. 5గేట్లను ఒక మీటర్ మేర ఎత్తి 22,395 క్యూసెక్కులు దిగువకు వదిలినట్లు తెలిపారు. కేసీ కెనాల్‌కు 1,058క్యూసెక్కులు వదిలినట్లు పేర్కొన్నారు.

నిండుకుండలా రామన్‌పాడు జలాశయం

మదనాపురం: మండలంలోని రామన్‌పాడు జలాశయంలో బుధవారం సముద్ర మట్టానికి పైన 1,021 అడుగుల పూర్తిస్థాయి నీటిమట్టం ఉన్నట్లు ఏఈ వరప్రసాద్ తెలిపారు. జూరాల ఎడమ కాల్వ నుంచి 390 క్యూసెక్కుల వరద జలాశయానికి కొనసాగుతుండగా.. సమాంతర కాల్వలో నీటి సరఫరా లేదని చెప్పారు. ఇదిలా ఉండగా జలాశయం నుంచి ఎన్టీఆర్ కాల్వకు 875 క్యూసెక్కులు, వివిధ ఎత్తిపోతల పథకాలకు 739 క్యూసెక్కులు, కుడి, ఎడమ కాల్వలకు 55 క్యూసెక్కులు, తాగునీటి అవసరాలకు 20 క్యూసెక్కుల నీటిని వినియోగిస్తున్నామని వివరించారు.

కోయిల్‌సాగర్ ఒక గేటు నుంచి..

దేవరకద్ర: కోయిల్‌సాగర్ ప్రాజెక్టు నుంచి బుధవారం ఒక గేటు ఎత్తి నీటిని విడుదల చేశారు. మంగళవారం రెండు గేట్ల ద్వారా నీటి విడుదలను కొనసాగించగా పైనుంచి పెద్దవాగు ఇన్‌ఫ్లో తగ్గడంతో బుధవారం ఒక గేటను మూసివేసి ఒక గేటు ద్వారా 750 క్యూసెక్కుల నీటిని వాగులోకి వదిలారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 32.6 అడుగులు ఉండగా ప్రస్తుతం 32.4 అడుగులు ఉంది. నీటి సామర్థ్యం 2.27 టీఎంసీలు కాగా ప్రస్తుతం 2.25 టీఎంసీలుగా నమోదైంది.



రిమాండ్‌కు మాజీ కౌన్సిలర్

మహబూబ్‌నగర్ క్రైం: మున్సిపల్ కమిషనర్‌ను ఫోన్‌లో అసభ్యపదజాలంతో దూషించిన కేసులో మాజీ కౌన్సిలర్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో సీఐ అప్పయ్య వివరాలు వెల్లడించారు. మహబూబ్‌నగర్ కార్పొరేషన్ పరిధిలోని 7వ వార్డు శ్రీనివాస కాలనీకి చెందిన మాజీ కౌన్సిలర్ కట్టా రవికిషన్‌రెడ్డి ఈనెల 23న కమిషనర్ టి.ప్రవీణ్‌కుమార్‌రెడ్డికి ఫోన్ చేసి తీవ్ర అసభ్య పదజాలంతో దూషించడమే కాకుండా కార్యా లయానికి వచ్చి ప్లాస్టిక్ కుర్చీలను కాళ్లతో తన్న డం, కమిషనర్‌ను అడ్డగించి విధులకు ఆటంకం కలిగించినట్లు తెలిపారు. కమిషనర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి కట్టా రవికిషన్ రెడ్డి అరెస్టు చేసి కోర్టులో హాజరుపరచి రిమాండ్‌కు తరలించినట్లు వెల్లడించారు.

తల్లి డబ్బులివ్వలేదని కొడుకు బలవన్మరణం

తిమ్మాజిపేట: స్నేహితుడి పెళ్లికి వెళ్లి వచ్చేందుకు డబ్బులు కావాలని తల్లిని కోరగా.. మందలించినందుకు మనస్తాపానికి గురైన కొడుకు బలవన్మరణానికి పాల్పడిన ఘటన మండలంలోని ఇప్పలపల్లిలో చోటుచేసుకుంది. హెడ్‌కానిస్టేబుల్ రాజశ్యామ్ కథనం ప్రకారం.. బీహార్‌కు చెందిన సుజితాదేవి కుటుంబ సభ్యులతో కలిసి తిమ్మాజిపేట మండలం ఇప్పలపల్లి శివారులోని స్నేహ కోళ్ల ఫారంలో కూలీ పనులు చేసుకుంటూ జీవిస్తున్నారు. 15రోజుల క్రితమే స్వగ్రామం నుంచి వచ్చి ఫారమ్‌లో పనులు చేసుకుంటున్నారు. ఈనెల 23న సాయంత్రం తనకు డబ్బులు కావాలని.. స్నేహితుడి పెళ్లికి వెళ్తానని కుమారుడు సుమిత్‌కుమార్(25) కోరడంతో తల్లి డబ్బులు లేవని మందలించింది. దీంతో మనస్తాపానికి గురై ఫారం సమీపంలోని చెట్టుకు ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అదే ఫారంలో పనిచేసే హేమంత్ అనే వ్యక్తి బుధవారం ఉదయం సమాచారం ఇవ్వడంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు.

విద్యుత్ స్తంభం ఆక్రమిత షెడ్డు కూల్చివేత



జేసీబీతో షెడ్డును కూల్చివేసిన మున్సిపల్ అధికారులు

సాక్షి ఎఫెక్ట్..

కల్వకుర్తి పట్టణంలో 11 కేవీ విద్యుత్ స్తంభాన్ని ఆక్రమించిన నిర్మించిన అక్రమ కట్టడాన్ని మున్సిపల్ అధికారులు కూల్చివేశారు. పట్టణంలోని విద్యానగర్‌కాలనీలో ఓ వ్యక్తి ఏకంగా 11 కేవీ విద్యుత్ స్తంభాల మధ్యనే ఇంటి నిర్మాణం చేపట్టంపై బుధవారం 'సాక్షి' లో 'వామ్మో.. ఇదెక్కడి చోద్యం' శీర్షికన వార్త ప్రచురితమవదంతో టౌన్‌ప్లానింగ్ సిబ్బంది జేసీబీతో షెడ్డును కూల్చివేశారు.అయితే మున్సిపల్ అధికారులకు ము డుపులు ఇస్తే వ్యవహారం చక్కబెడుతున్నారని, లేదంటే ఇలాంటి చర్యలకు ఉపక్రమిస్తున్నారని సదరు యజమాని తెలిపారు. పట్టణంలో ఇంకా ఇలాంటి అనుమతులు లేని వాటిపై కూడా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నా రు. అనుమతులు లేని, ఆక్రమణకు గురైన వా టిపై ప్రజలు ఫిర్యాదు చేసినా, మా దృష్టికి వచ్చిన మున్సిపల్ నూతన చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటామని కమిషనర్ మహమూద్ షేక్ తెలిపారు.

కల్వకుర్తి టౌన్

చేపల ప్రాసెసింగ్ కేంద్రం ఏర్పాటుకు స్థల పరిశీలన



వై.శాఖాపూర్ శివారులో స్థలం పరిశీలిస్తున్న కలెక్టర్ ఆదర్శ్‌సురభి

వనపర్తి: జిల్లాలో అంతర్జాతీయ మత్స్య రవాణా, ప్రాసెసింగ్ కేంద్రం ఏర్పాటుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని కలెక్టర్ ఆదర్శ్‌సురభి తెలిపారు. ఇందులో భాగంగా బుధవారం పెబ్బేరు మండలంలోని వై.శాఖాపురం గ్రామ శివారులోని సర్వే నంబరు 163, 162, 143లో గల పది ఎకరాల ప్రభుత్వ ఖాళీ స్థలాన్ని తహసీల్దార్ మురళితో కలిసి పరిశీలించారు. అదేవిధంగా మహిళా సంఘాల సభ్యులకు పెట్రోల్ బంకు ఏర్పాటు కోసం పెబ్బేరు మండలం తోమాలపల్లి శివారులో జాతీయ రహదారి పక్కన సర్వే నంబర్ 104లో ఖాళీగా ఉన్న 30 గుంటల ప్రభుత్వ స్థలాన్ని పరిశీలించారు. అనంతరం పెబ్బేరు మున్సిపాలిటీలో మల్లికార్జున ఫర్టిలైజర్ షాపును ఆకస్మికంగా తనిఖీ చేశారు. దుకాణానికి ఇప్పటి వరకు సరఫరా అయిన యూరియా, పంపిణీ చేసిన వివరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రైతులకు అవసరమైన యూరియాను పారదర్శకంగా అందించేందుకు వ్యవసాయ శాఖ అధికారులు తగు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పెబ్బేరు, శ్రీరంగాపూర్‌లో ఎరువుల అవసరాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు.

ఉత్సాహంగా ఎస్‌జీఎఫ్ బాక్సింగ్ ఎంపికలు



మాట్లాడుతున్న డీవైఎస్‌ఓ శ్రీనివాస్

మహబూబ్‌నగర్ క్రీడలు: జిల్లా కేంద్రంలోని మెయిన్ స్టేడియంలో బుధవారం స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్–14, అండర్–17, అండర్– 19 విభాగాల బాల, బాలికల బాక్సింగ్ ఎంపిక లు నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న జిల్లా యువజన, క్రీడల అ ధికారి శ్రీనివాస్ మాట్లాడుతూ.. రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్ బాక్సింగ్ పోటీల్లో విద్యార్థులు ప్రతిభ చాటి పతకాలు సాధించాలని కోరారు. జిల్లా క్రీడాకారులు బాక్సింగ్‌లో జాతీయ, అంతర్జాతీ య స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో జిల్లా ఎస్‌జీఎఫ్ కార్యనిర్వాహక కార్యద ర్శి డాక్టర్ శారదాభాయి, బాక్సింగ్ కోచ్ నర్సింహ, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మల్లిక ఆస్పత్రిలో అరుదైన సర్జరీ



ముత్యాలును పరీక్షిస్తున్న వైద్యుడు

పాలమూరు: మల్లిక ఆస్పత్రి కార్డియాలజీ వైద్య బృందం ఒక అరుదైన గుండె సర్జరీ చేసింది. నాగర్‌కర్నూల్ జిల్లా లింగాలకి చెందిన ముత్యాలు ఈనెల 18న తీవ్రమైన ఆయాసంతో మల్లిక ఆస్పత్రికి రాగా పరీక్షించి గుండె వైద్యనిపుణుడు మహేష్‌బాబు రోగికి 4డీ–టీఈఈ స్కానింగ్ చేయగా అతనికి ఏఎస్‌డీ,(ఎట్రియల్ సెప్టల్ డిఫెక్ట్), సివియర్ పల్మోనరీ వాల్వ్యుస్టెనోసిస్ సమస్య ఉన్నట్లు గుర్తించారు. దీంతో ఈనెల 22న మల్లిక వైద్య బృందం క్యాథ్ ల్యాబ్ టెక్నిక్ సహాయంతో కోత లేకుండా ఏఎస్‌డీ–డివైజ్ క్లోజ్ పల్మోనరి వాల్వ్ బెలూన్ వాల్వులోప్లాస్టీ సర్జరీని 30నిమిషాల్లో పూర్తి చేశారు. ఇతడికి భవిష్యత్‌లో ఎలాంటి గుండె సంబంధింత సమస్యలు రావని వైద్యుడు మహేష్ వెల్లడించారు. చాలా ప్రత్యేకమైన కేసుకు సర్జరీ చేశామని, ఉమ్మడి జిల్లాలో ఇలాంటి కేసుకు సర్జరీ చేయడం మొదటిసారి అని తెలిపారు. కేవలం 24 గంటల్లో రోగిని డిశ్చార్జ్ చేసినట్లు చెప్పారు.

ఆస్పత్రి వద్ద హైడ్రామా!

- కడుపునొప్పి అంటూ ఆస్పత్రికి వచ్చిన వ్యక్తి మృతి
- ఆస్పత్రి వద్ద కుటుంబసభ్యులు, బంధువుల ఆందోళన
- ప్రముఖులు రాజీ కుదుర్చడంతో కథ సుఖాంతం

వనపర్తి: జిల్లాకేంద్రంలోని గాంధీచౌక్ ప్రాంతంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రి వద్ద బుధవారం సాయంత్రం ఓ యువకుడి అనుమానాస్పద మృతి హైడ్రామాకు దారితీసిందనే చర్చ వినిపిస్తోంది. స్థానిక బాలనగర్ కాలనీకి చెందిన ఎల్లపు కుమార్(37) కడుపునొప్పిగా ఉందని ఆస్పత్రికి వచ్చాడు. వైద్యులు చికిత్స అందిస్తుండగానే.. మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మృతుడి కుటుంబ సభ్యులు, బంధువులు ఆస్పత్రి వద్ద నిరసన వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని పరిస్థితిని అదుపు చేసే ప్రయత్నం చేశారు. ఇంతలోనే పట్టణంలోని కొందరు ప్రముఖ రాజకీయ నాయుకులు జోక్యం చేసుకుని రాజీ కుదుర్చడంతో కథ సుఖాంతమైనట్లు తెలుస్తోంది. రూ.లక్షల్లో ఆస్పత్రి యాజమాన్యం మృతుడి కుటుంబానికి ఆర్థికసాయం అందజేసినట్లు సమాచారం. ఈ విషయంపై ఆస్పత్రి వైద్యులను వివరణ కోరగా.. వైద్యం చేస్తుండగానే అకస్మాత్తుగా గుండెపోటు వచ్చింది. ఆయన్ను కాపాడే సమయం లభించలేదు, వైద్యం అందించడంలో ఎలాంటి నిర్లక్ష్యం వహించలేదని చెప్పారు.



ఆస్పత్రి వద్ద గుమిగూడిన బంధువులు, ఇన్‌సెట్‌లో ఎల్లపు కుమార్(ఫైల్)

చంద్రఘంటాదేవి.. పాహిమాం


మకరతోరణంలో జోగుళాంబదేవి


అమ్మవారికి మకరతోరణం బహూకరిస్తున్న దాతలు

- వైభవంగా శరన్నవరాత్రి ఉత్సవాలు
- ప్రముఖులు, దాతల ప్రత్యేక పూజలు

అలంపూర్: చంద్రఘంట మాతా.. పాహిమాం అంటూ భక్తులు అమ్మవారిని శరణు కోరారు. అలంపూర్ క్షేత్రంలో శరన్న నవరాత్రి ఉత్సవాలు అత్యంత వైభవోపేతంగా కొనసాగాయి. ఉత్సవాల మూడో రోజు బుధవారం జోగుళాంబ మాత చంద్రఘంట దేవీగా భక్తులకు దర్శనమిచ్చారు. వివిధ ప్రాంతాల నుంచి తరలొచ్చిన భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. చంద్రఘంట మాతను ప్రత్యేక మండపంలో కొలువుదీర్చగా.. అర్చక స్వాములు కొలువుపూజ, దర్బారు సేవ, కుమారి పూజ, సువాసిని పూజ, మహామంగళహారతి, నీరజన మంత్ర పుష్పములు వంటి విశేష పూజలు నిర్వహించారు. అదే విధంగా అమ్మవారి సన్నిధిలో ఉదయం నుంచి నిరంతరాయంగా నిత్యానుష్ఠానం, అవాహిత దేవతా హోమాలు, కుంకుమార్చనలు, శ్రీచక్రనవావరణ అర్చనలు, సహస్రనామార్చన దశవిధ హారతులను అందజేశారు. శరన్నవరాత్రుల్లో జోగుళాంబను మూడోరోజు చంద్రఘంట మాతగా ఆరాధిస్తారని అర్చకస్వాములు తెలిపారు. అమ్మవారు శిరస్సుపై అర్ధచంద్రుడు అర్ధాకృతిలో ఉండడంతో చంద్రఘంట దేవీగా పేరుగాంచినట్లు భక్తులకు వివరించారు. అమ్మవారు చేతుల్లో శస్త్ర, అస్త్రాలను ధరించి ఉంటారని, చంద్రఘంట అమ్మవారిని ఆరాధించిన వారికి మంగళం సిద్ధిస్తుందని భక్తుల ప్రగాఢ విశ్వాసం. ఉత్సవాల్లో భాగంగా ఆలయాల్లో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. క్షేత్రానికి తరలి వచ్చిన భక్తులకు ప్రసాద్ స్కీం భవనంలో బాలబ్రహ్మేశ్వరస్వామి నిత్యాన్నదాన సత్రంలో అన్నప్రసాదం అందజేశారు. ఉత్సవాల్లో పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. అదనపు ఎస్పీ శంకర్ ఎస్ఐ వెంకటస్వామితో కలిసి పరిశీలించారు.

అమ్మవారి ఆశీస్సులు అందరిపై ఉండాలి

అలంపూర్: జోగుళాంబ అమ్మవారి ఆశీస్సులు అందరిపై ఉండాలని మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ పేర్కొన్నారు. అలంపూర్ క్షేత్ర ఆలయాలను ఎంపీ డీకే అరుణ కుటుంబ సమేతంగా బుధవారం దర్శించుకున్నారు. ఈఓ దీప్తి అర్చకులతో కలిసి ఆలయ మర్యాదలతో ఎంపీకి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆమె బాలబ్రహ్మేశ్వర, జోగుళాంబ ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేసి అమ్మవారికి పట్టువస్త్రాలను సమర్పించారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు శేషవస్త్రాలతో సత్కరించారు. అర్చక స్వాములు తీర్థ ప్రసాదాలను అందజేసి ఆశీర్వచనం పలికారు. వీరితోపాటు బీజేపీ నాయకులు తదితరులు ఉన్నారు. ఎంపీ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రజలకు దసరా శరన్నవరాత్రి శుభాకాంక్షలు తెలిపారు. జోగుళాంబ అమ్మవారి ఆశీర్వాదం రాష్ట్ర, దేశ ప్రజలపై ప్రధాన మంత్రి నరేంద్రమోదీ నాయకత్వంపై ఉండాలని ఆకాంక్షించినట్లు తెలిపారు. శక్తి పీఠ క్షేత్ర అభివృద్ధికి కేంద్రం ద్వారా గతంలోనే నిధులు వచ్చాయన్నారు. ఇంకా కొన్ని పనులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. పెండింగ్ పనులకు సంబంధించి ప్రతిపాదనలు పంపిస్తే నిధులు మంజూరు కావడానికి అవకాశం ఉంటుందన్నారు. దేవదాయ, పర్యాటక శాఖ అధికారులు సమన్వయంతో ఉమ్మడి ప్రతిపాదనలు చేయడానికి చొరవ తీసుకోవాలన్నారు. గతంలో అన్ని పనులకు కలిపి నిధులు మంజూరయ్యాయని, పెండింగ్‌కు పనులకు సంబంధించిన వివరాలు ఇవ్వాలన్నారు. నిధుల మంజూరుపై సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకరావాలని సూచించారు.

ఎంపీకి వినతులు

అలంపూర్ క్షేత్ర ఆలయాలను దర్శించుకున్న మహబుబ్‌నగర్ ఎంపీ డీకే అరుణకు పలువురు వినతులు అందజేశారు. క్షేత్రానికి వచ్చే భక్తుల సౌకర్యార్థం బాలబ్రహ్మేశ్వర, జోగుళాంబ రైల్వే స్టేషన్‌లో అన్ని రైళ్లు నిలిపేలని పాలక మండలి సభ్యులు వినతి పత్రం అందజేశారు. రైల్వేస్టేషన్ మీదుగా రాకపోకలు సాగించే ఒక రైలుకు జోగుళాంబ ఎక్స్‌ప్రెస్ పేరుగా నామకరణ చేయాలని కోరారు. అలంపూర్ క్షేత్రానికి దర్శనానికి వచ్చే క్రమంలో పలువురు నాయకులు డీకే అరుణ ఆధ్వర్యంలో బీజేపీలో చేరారు. నాయకులు శరత్‌బాబు, రంగస్వామి, నరేశ్, లక్ష్మణ్, మద్దిలేటి, వెంకటస్వామి తదితరులు ఉన్నారు.

అమ్మవారికి మకరతోరణం

అలంపూర్: జోగుళాంబ అమ్మవారికి భక్తులు మకరతోరణం బహూకరించినట్లు ఈఓ దీప్తి తెలిపారు. హైదరాబాద్‌కు చెందిన భక్తులు తీగల క్రాంతిరెడ్డి, లక్ష్మీస్రవంతి అమ్మవారికి బంగారం పూతతో మకరతోరణం పీఠం తొడుగులను బహూకరించినట్లు పేర్కొన్నారు. వీటి విలువ దాదపు రూ.55లక్షల వరకు ఉంటుందన్నారు. తీగల క్రాంతిరెడ్డి, లక్ష్మీస్రవంతికి ఈఓ స్వాగతం పలికి జోగుళాంబ, బాలబ్రహ్మేశ్వర స్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేయించారు. అనంతరం వారిని శేషవస్త్రాలతో సత్కరించగా అర్చకులు తీర్థప్రసాదాలను అందజేసి ఆశీర్వచనం పలికారు.


నవరాత్రి ఉత్సవాల్లో సాంస్కృతిక ప్రదర్శన


పట్టు వస్త్రాలు సమర్పిస్తున్న ఎంపీ డీకే అరుణ


భద్రతను పర్యవేక్షిస్తున్న అదనపు ఎస్పీ శంకర్

అక్టోబర్ 22 నుంచి కురుమూర్తి జాతర


జాతర పోస్టర్‌ను విడుదల చేస్తున్న కలెక్టర్ విజయేందిర, ఎస్పీ జానకి, అదనపు కలెక్టర్ శివేంద్రప్రతాప్, ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి తదితరులు

- బ్రహ్మోత్సవాలకు పకడ్బందీగా ఏర్పాటు
- భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు
- కోఆర్డినేషన్ కమిటీ సమావేశంలో కలెక్టర్ విజయేందిర ఆదేశం

జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): వచ్చేనెల 22 నుంచి నవంబర్ 7 వరకు నిర్వహించనున్న కురుమూర్తిస్వామి (జాతర) బ్రహ్మోత్సవాలను పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ విజయేందిర అన్నారు. కురుమూర్తిస్వామి జాతర ఏర్పాట్లపై బుధవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డితో కలిసి కలెక్టర్ జిల్లాస్థాయి కోఆర్డినేషన్ కమిటీ సమావేశం నిర్వహించి.. జాతర వాల్‌పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం లాగే ఈసారి కూడా బ్రహ్మోత్సవాలకు వచ్చే భక్తుల కోసం ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక రూపొందించుకొని అందుకనుగుణంగా ఏర్పాట్లు చేయాలన్నారు. బ్రహ్మోత్సవాలు అక్టోబర్ 22న ప్రారంభమవుతాయని, 26న స్వామివారి అలంకారోత్సవం, 28న ఉద్దాల ఉత్సవం, నవంబర్ 2న స్వామివారి కల్యాణోత్సవం ఉంటుందన్నారు. బ్రహ్మోత్సవాలకు వచ్చే భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఉండేందుకు తాగునీరు, పారిశుద్ధ్యం, ఆహారం, ఫెస్టివల్, లా అండ్ ఆర్డర్ తదితర ముఖ్యమైన కమిటీలను ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. జాతరకు వచ్చే భక్తుల కోసం తాగునీరు, పారిశుధ్యం, టాయిలెట్లు, బందోబస్తు, రవాణా సౌకర్యాలు, వాహనాల పార్కింగ్ ఏర్పాటుకు ఆయా శాఖల అధికారులు చర్యలు చేపట్టాలన్నారు.

- బందోబస్తులో భాగంగా ఇంటిగ్రేటెడ్ కంట్రోల్ రూం ఏర్పాటు చేయాలని, జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ తరఫున ప్రథమ చికిత్స, అంబులెన్స్‌లు అందుబాటులో ఉంచాలన్నారు.
- ఆర్అండ్‌బీ ద్వారా బారికేడింగ్, రహదారులకు ప్యాచ్ వర్క్స్, మరమ్మతు చేయించాలని ఆదేశించారు. పీఆర్ పరిధిలోని రోడ్లపై గుంతలు పూడ్చాలని, రోడ్డు పొడవునా జంగిల్ కటింగ్ చేయాలన్నారు.
- మిషన్ భగీరథ శాఖ ద్వారా తాత్కాలిక మరుగుదొడ్లు నిర్మించాలని, షవర్లు పెట్టాలని, భక్తులకు అసౌకర్యం లేకుండా తాగునీరు సరఫరా చేయాలన్నారు. ముఖ్యమైన రోజులలో అవసరమైతే ట్యాంకర్ల ద్వారా తాగునీటిని సరఫరా చేపట్టాలన్నారు.
- 24 గంటలు విద్యుత్ సరఫరా ఉండేలా చూడాలని, జనరేటర్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు.
- ఎక్సైజ్ శాఖ ద్వారా అవసరమైనంత సిబ్బందిని ఏర్పాటు చేసి బెల్ట్ షాపులను మూసివేయడమే కాకుండా, మద్యం అమ్మకాలు లేకుండా చూసుకోవాలన్నారు.
- భక్తులకు అన్ని విషయాలు తెలిసేలా సైన్ బోర్డులు ఏర్పాటు చేయాలని, ఆర్టీసీ ద్వారా తగినన్ని బస్సులు నడిపించాలని, పంచాయతీ శాఖ ద్వారా శానిటేషన్‌కు ఎక్కువ మంది సిబ్బందిని ఏర్పాటు చేసి పారిశుద్ధ్య సమస్య రాకుండా చూసుకోవాలన్నారు.
- బ్రహ్మోత్సవాలపై జిల్లాలోని ప్రజలతోపాటు ఇతర ప్రాంతాలకు తెలిసే విధంగా విస్తృత ప్రచారం చేయాలని డీపీఆర్‌ఓను ఆదేశించారు.
- ఎస్పీ జానకి మాట్లాడుతూ జాతరలో బందోబస్తు, శాంతిభద్రతల పర్యవేక్షణ, ట్రాఫిక్ నియంత్రణ, పార్కింగ్ సదుపాయం పోలీస్ శాఖ ద్వారా నిర్వహించనున్నట్లు చెప్పారు. షీ టీం, మఫ్టీ టీంలను ఏర్పాటు చేసి చోరీలు, ఇతరత్రా అవాంఛనీయ ఘటనలు జరగకుండా చూస్తామన్నారు.

విజయవంతం చేద్దాం..

దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో సమ్మక్క, సారలమ్మ జాతర తర్వాత కురుమూర్తిస్వామి బ్రహ్మోత్సవాలకు అధిక సంఖ్యలో భక్తులు వస్తారని, ఆయా శాఖల అధికారులు సమన్వయంతో జాతరను విజయవంతం చేసేందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని కోరారు. దేవరకద్ర నుంచి కురుమూర్తి ఆలయానికి వచ్చే దారిలో రైల్వే అండర్ పాస్ బ్రిడ్జి వద్ద రెండు చోట్ల డైవర్షన్ చేసిన సర్వీస్ రోడ్లకు మరమ్మతు చేపట్టాలని సూచించారు. సామాన్య భక్తుల దర్శనానికి ఇబ్బంది కలగకుండా చూడాలని సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ శివేంద్రప్రతాప్, కురుమూర్తిస్వామి ఆలయ చైర్మన్ గోవర్ధన్‌రెడ్డి, ఈఓ మదన్‌రెడ్డి, జిల్లా, చిన్నచింతకుంట మండల అధికారులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

పెండింగ్ వేతనాలు ఇవ్వాలి



జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): గ్రామ పంచాయతీ వర్కర్స్‌కు పెండింగ్‌లో ఉన్న మూడు నెలల వేతనాలను వెంటనే ఇవ్వాలని తెలంగాణ గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియర్ రాష్ట్ర అధ్యక్షుడు నరసింహారెడ్డి కోరారు. ఈ మేరకు బుధవారం హైదరాబాద్‌లో పీఆర్, గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ సృజనకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దసరా పండుగకు తమతోపాటు తమ కుటుంబ సభ్యులు మొత్తం పస్తులు ఉండాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీ మేరకు పంచాయతీ సిబ్బందికి గ్రీన్ చానల్ ద్వారా బ్యాంక్ అకౌంట్లలో జమ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకటరాజ్యం, ఉప ప్రధాన కార్యదర్శి రామచంద్రయ్య, మహిళా కన్వీనర్ పద్మమ్మ, జిల్లా నాయకులు ఆంజనేయులు పాల్గొన్నారు.

పెరగని ఉల్లి ధర



దేవరకద్ర: పట్టణంలోని మార్కెట్ యార్డులో బుధవారం ఉల్లి వేలం నిర్వహించారు. వివిధ గ్రామాల నుంచి రైతులు దాదాపు వేయి బస్తాల ఉల్లిని అమ్మకానికి తెచ్చారు. ఉల్లి క్వింటాల్ ధర గరిష్టంగా రూ.1,700, కనిష్టంగా రూ.1,200 ధరలు నమోదయ్యాయి. కర్నూలు, రాయచూర్ ప్రాంతాలకు కొత్త ఉల్లి రాకతో ధరలు బాగా పడిపోయాయి. దీంతో దేవరకద్ర మార్కెట్‌పై కూడా ఆ ప్రభావం కనిపించింది. 50 కిలోల బస్తా ధర గరిష్టంగా రూ.850, కనిష్టంగా రూ.600 చొప్పున విక్రయించారు.

ఆముదాల ధర రూ.5,709

దేవరకద్ర మార్కెట్ యార్డులో బుధవారం మధ్యాహ్నం జరిగిన టెండర్లలో ఆముదాల ధర క్వింటాల్ రూ.5,709, హంస ధాన్యం ధర క్వింటాల్ రూ.1,701 ఒకే ధర లభించింది.

మొక్కజొన్న క్వింటాల్ రూ.1,913

జడ్చర్ల: బాదేపల్లి వ్యవసాయ మార్కెట్‌లో బుధవారం మొక్కజొన్న క్వింటాల్ గరిష్టంగా రూ.1,913, కనిష్టంగా రూ.1,601 ధరలు లభించాయి. అలాగే ఆముదాలకు గరిష్టంగా రూ.5,906, కనిష్టంగా రూ.5,856, ఉలువలు రూ.3,501 చొప్పున వచ్చాయి.

ప్రజలకు నమ్మకం కల్పించాలి


బాలానగర్‌లో డీఐజీ ఎల్ఎస్ చౌహాన్‌కు మొక్క అందజేసి స్వాగతం పలుతున్న డీఎస్పీ వెంకటేశ్వర్లు

రాజాపూర్ (బాలానగర్)/ అడ్డాకుల/ భూత్పూర్: సమస్యలతో పోలీస్‌స్టేషన్‌కు వచ్చే ప్రజలకు భద్రత, నమ్మకం కల్పించాలని జోగుళాంబ జోన్ డీఐజీ ఎల్ఎస్ చౌహాన్ అన్నారు. బుధవారం బాలానగర్, మూసాపేట మండల కేంద్రాల్లో పోలీస్‌స్టేషన్లను ఆయన ఎస్పీ జానకితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా స్టేషన్‌లోని రికార్డులను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. రోడ్డు ప్రమాదాలు జరిగే స్పాట్లను గుర్తించి నివారణ చర్యలు తీసుకోవాలని సూచించారు. సైబర్ నేరాలపై సిబ్బంది ప్రత్యేక శిక్షణ పొందుతూ ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. పోలీస్‌స్టేషన్‌కు వచ్చే ప్రజలతో మర్యాదగా వ్యవహరించి వారి సమస్యలు పరిష్కరించాలని చెప్పారు. అలాగే భూత్పూర్ సీఐ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. పోలీస్‌స్టేషన్లలో రికార్డుల నిర్వహణ, పరిశుభ్రత, కేసుల దర్యాప్తు తదితర వాటిపై సమీక్ష నిర్వహించారు. విలేజ్ పోలీసు ఆఫీసర్లు వారికి కేటాయించిన గ్రామాల్లో పర్యటిస్తూ ప్రజల సమస్యలు తెలుసుకొని, తక్షణమే స్పందించాలని డీఐజీ సూచించారు. వారి వెంట డీఎస్పీ వెంకటేశ్వర్లు, సీఐలు నాగార్జునగౌడ్, రామకృష్ణ, ఎస్ఐలు లెనిన్‌గౌడ్, శివకుమార్‌నాయుడు, శివానందంగౌడ్, వేణు, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్ఎస్ఎస్‌తో విద్యార్థులకు బాధ్యత


వీసీని సన్మానిస్తున్న రిజిస్ట్రార్ రమేశ్‌బాబు,కోఆర్డినేటర్ ప్రవీణ ప్రోగ్రాం అధికారులు

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: ఎన్ఎస్ఎస్‌తో విద్యార్థులు పాల్గొంటే సామాజిక బాధ్యత పెరుగుతుందని పీయూ వీసీ శ్రీనివాస్ పేర్కొన్నారు. ఈమేకు పీయూ ఫార్మసీ ఆడిటోరియంలో బుధవారం ఎన్ఎస్ఎస్ డేను నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వీసీ హాజరై విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. ఎన్ఎస్ఎస్ వలంటీర్‌లు గ్రామాలను దత్తత తీసుకుని, వాటిలో అనేక సామాజిక కార్యక్రమాలు, పచ్చదనం పరిశుభ్రత వంటి కార్యక్రమాలు నిర్వహించడం గొప్ప విషయమన్నారు. బాల్య వివాహాలు, పారిశుద్ధ్యం, అక్షరాస్యత, ఆరోగ్యంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించడంతో ప్రజలకు ఎంతో ప్రయోజనం ఉందన్నా రు. గ్రామాల్లో 7 రోజులపాటు నిర్వహించే కార్యక్రమాల్లో ఎన్నో అనుభవాలను నేర్చుకునేందుకు అవకాశం ఉందన్నారు. పీయూలో నిర్వహించిన క్యాంపులో పరిసరాలను పరిశుభ్రంగా చేయడం అభినందించ విషయమన్నారు. రిజిస్ట్రార్ రమేశ్‌బాబు మాట్లాడుతూ.. వలంటీర్స్ మొక్కలను నాటి వాటిని సంరక్షించాల ని, వాటిద్వారా ప్రకృతికి మేలు జరుగుతుందన్నా రు. చురుకుగా యువ వలంటీర్‌లు పీయూ ఎన్ఎస్ఎస్ కార్యక్రమాన్ని ముందుకు తీసుకెళ్లాలని సూచించారు. ఈ సందర్భంగా వ్యాసరచన, పాటల పోటీల్లో ప్రతిభ కనబర్చిన వారికి బహుమతులను ప్రదానం చేశారు. అనంతరం వీసీని ప్రోగ్రామ్ అధికారులు సన్మానించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ ప్రవీణ, ఆడిట్ సెల్ డైరెక్టర్ చంద్రకిరణ్, వైస్ ప్రిన్సిపాల్ కృష్ణయ్య, ప్రోగ్రాం అధికారులు రవికుమార్, గాలెన్న, అర్జున్‌కుమార్, రాఘవేందర్, ఈశ్వర్, శివకుమార్, చిన్నాదేవి పాల్గొన్నారు.

ఖైదీలకు మెరుగైన సేవలు అందించాలి


సబ్‌జైలును తనిఖీ చేస్తున్న జిల్లా న్యాయసేవాదికార సంస్థసెక్రటరీ నసీం సుల్తానా

నాగర్‌కర్నూల్ క్రైం: సబ్‌జైలులో శిక్ష అనుభవిస్తున్న ఖైదీలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని సదుపాయాలు కల్పించాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ సెక్రటరీ నసీం సుల్తానా అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని సబ్ జైలును ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మట్లాడుతూ ఖైదీలకు కల్పిస్తున్న వసతుల గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఎవరైనా న్యాయవాదిని పెట్టుకునే స్తోమత లేని వారికి న్యాయసేవాధికార సంస్థ తరఫున ప్రభుత్వ న్యాయవాదిని ఉచితంగా నియమిస్తామన్నారు. వంటశాల, ఆహార పదార్థాలు, వంట సరుకులను పరిశీలించారు. ఖైదీలకు మెనూ ప్రకారం ఆహారాన్ని అందిస్తున్నారా లేదా అని ఆరా తీశారు. జైలు పరిసరాలను పరిశీలించి పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సబ్ జైలర్ గుణశేఖర నాయుడు, డిప్యూటీ చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ శ్రీరామ్ ఆర్య పాల్గొన్నారు.

పల్లెగడ్డ ప్రజలకు ఇచ్చిన నోటీసులు రద్దు చేయాలి



మరికల్: పల్లెగడ్డ గ్రామాన్ని ఖాళీ చేయాలని దేవాదాయ శాఖ గ్రామస్తులకు ఇచ్చిన నోటీసులను వెంటనే రద్దు చేయాలని బుధవారం సీపీఐఎంఎల్, మాస్‌లైన్ పార్టీల ఆధ్వర్యంలో తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. సీపీఐఎంఎల్ జిల్లా కార్యదర్శి కాశీనాథ్, మాస్‌లైన్ పార్టీ జిల్లా కార్యదర్శి రాము మాట్లాడుతూ పల్లెగడ్డ గ్రామంలో తరతరాలుగా ఉంటున్న 280 కుటుంబాలకు అన్ని రకాల హక్కులు కల్పించాలన్నారు. అన్ని కుటుంబాలు ఏళ్లుగా ఇంటి, నీటి, కరెంట్ బిల్లులు చెల్లిస్తున్నారని గుర్తు చేశారు. అనంతరం తహసీల్దార్ రాంకోటి మాట్లాడుతూ గ్రామస్తులకు న్యాయం జరిగేలా చూస్తానన్నారు. కార్యక్రమంలో నాయకులు సలీం, హన్మంతు, చెన్నయ్య, రాములు, కుర్మయ్య, యాదగిరి, రాము, రామాంజనేయులు, వెంకట్రాములు, హాజిమలాంగ్ పాల్గొన్నారు.

మహిళా కానిస్టేబుల్‌కు కాంస్యం



మహబూబ్‌నగర్ క్రైం: హర్యానా రాష్ట్రంలో ఈ నెల 20నుంచి 24 వరకు జరిగిన ఆల్ ఇండియా 74వ పో లీస్ రెజ్లింగ్ క్లస్టర్‌లో జిల్లా పో లీస్ శాఖకు చెందిన కానిస్టేబుల్ రాధిక కాంస్య పత కం సాధించారు. తెలంగాణ పోలీస్ మహిళా ఆర్మ్ రెజ్లింగ్ క్రీడకారిణి అడ్డాకుల పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహించే కానిస్టేబుల్ రాధిక క్యాంస పతకం సాధించింది. దీంతో కానిస్టేబుల్‌రాధికను ఎస్పీ జానకి అభినందించారు.

షార్ట్‌సర్క్యూట్: రూ.లక్ష నష్టం

కల్వకుర్తి టౌన్: పట్టణంలోని టైలర్ దుకాణంలో షార్ట్‌సర్క్యూట్‌తో అగ్ని ప్రమాదం బుధవారం చోటుచేసుకుంది. పట్టణంలోని తిలక్‌గనర్ కాలనీలో నివాసముండే మురళి ఇంటి వద్ద బాలాజీ టైలర్ దుకాణాన్ని నడిపిస్తున్నాడు. మంగళవారం రాత్రి దుకాణం మూసి నిద్రించాడు. తెల్లవారు జామున ఒక్కసారిగా ఇంటిచుట్టూ పొగ కమ్ముకోవడంతో కిందకు వెళ్లి చూశాడు. దుకాణంలో మంటలు వ్యాపించినట్లు గమనించి అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇవ్వగా సిబ్బంది ఘటన స్థలానికి చేరుకొని మంటలను ఆర్పివేశారు. ఈ ప్రమాదంలో రూ.లక్ష వరకు నష్టం వాటిల్లిందని బాధితుడు తెలిపారు. ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

పాలమూరుకు క్రీడాకళ


జిల్లా ఫుట్‌బాల్ సీనియర్ పురుషుల జట్టుతో అసోసియేషన్ ప్రతినిధులు

- నేటినుంచి సీనియర్ పురుషుల ఫుట్‌బాల్ పోటీలు
- నాలుగు రోజులపాటు మెయిన్ స్టేడియంలో నిర్వహణ
- 240 మంది క్రీడాకారులు, 40 మంది అఫీషియల్స్

మహబూబ్‌నగర్ క్రీడలు: జిల్లా కేంద్రం రాష్ట్రస్థాయి సీనియర్ పురుషుల ఫుట్‌బాల్ పోటీలకు వేదిక కానుంది. మెయిన్ స్టేడియంలో గురువారం నుంచి ఈనెల 28వ తేదీ వరకు ఫుట్‌బాల్ పోటీలు జరగనున్నాయి. జిల్లాలో మూడోసారి రాష్ట్రస్థాయి సీనియర్ ఫుట్‌బాల్ పోటీలు నిర్వహించనున్నారు.

టోర్నీలో పాల్గొననున్న 12 జట్లు

రాష్ట్రస్థాయి సీనియర్ పురుషుల ఫుట్‌బాల్ చాంపియన్ షిప్‌లో ఉమ్మడి జిల్లాలైన మహబూబ్‌నగర్, ఖమ్మం, నిజామాబాద్, వరంగల్, ఆదిలాబాద్, రంగారెడ్డి, కరీంనగర్, మెదక్, నల్గొండ జట్లతోపాటు వనపర్తి, జోగుళాంబ గద్వాల, సిద్దిపేట జట్లు పాల్గొంటున్నాయి. 240మంది క్రీడాకారులు, 24మంది కోచ్, మేనేజర్లు, 10 మంది టెక్నికల్ అఫీషియల్స్ హాజరవుతున్నారు. టోర్నీలో పాల్గొనే క్రీడాకారులకు లిటిల్ స్కాలర్స్, రెయిన్ బో, మాడ్రన్ స్కూల్‌లో వసతి, మెయిన్ స్టేడియంలో భోజన సౌకర్యం కల్పించనున్నారు.

లీగ్ కమ్ నాకౌట్ పద్ధతిలో మ్యాచ్‌లు

ఫుట్‌బాల్ టోర్నీలో లీగ్ కమ్ నాకౌట్ పద్ధతిలో మ్యాచ్‌లు జరగనున్నాయి. టోర్నీలో మొత్తం 19 మ్యాచ్‌లు నిర్వహించనున్నారు. టోర్నీలో పాల్గొనే జట్లను నాలుగు గ్రూపులుగా విభజించారు. గ్రూప్-ఏలో వనపర్తి, నిజామాబాద్, ఆదిలాబాద్, గ్రూప్-బిలో మహబూబ్‌నగర్, ఖమ్మం, కరీంనగర్, గ్రూప్-సిలో సిద్దిపేట, నల్గొండ, రంగారెడ్డి, గ్రూప్-డిలో గద్వాల, మెదక్, వరంగల్ జట్లు ఉన్నాయి. నేడు ఉదయం 11గంటలకు స్టేడియంలో రాష్ట్రస్థాయి సీనియర్ పురుషుల ఫుట్‌బాల్ చాంపియన్ షిప్‌ను క్రీడాశాఖ మంత్రి వాకిటి శ్రీహరి, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి ప్రారంభించనున్నారు. ఈనెల 28న సాయంత్రం 3గంటలకు జరిగే ముగింపు వేడుకల్లో స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ చైర్మన్ శివసేనారెడ్డి, ఇతర ప్రజాప్రతినిధులు పాల్గొంటున్నారు.

టోర్నమెంట్ ఏర్పాట్ల పరిశీలన

మెయిన్ స్టేడియంలో జరిగే ఏర్పాట్లను ఉమ్మడి జిల్లా ఒలింపిక్ సంఘం అధ్యక్షుడు, జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎన్‌పీ వెంకటేశ్, ప్రధాన కార్యదర్శి భానుకిరణ్ తదితరులు పరిశీలించారు. అదేవిధంగా జిల్లా జట్టుకు క్రీడాదుస్తులు అందజేశారు. కార్యక్రమంలో సభ్యులు గజానంద్‌కుమార్, సూర్యప్రకాశ్, ఇమాన్యుయేల్ జేమ్స్, రామేశ్వర్, నగేశ్, రామకృష్ణ పాల్గొన్నారు.

ఫుట్‌బాల్ పురుషుల జిల్లా జట్టు

అరుణ్, నికేశ్, దినేశ్, రాములు, కృష్ణ, శ్రీకాంత్, ప్రకాశ్, నరేష్, స్నేహిత్, సాయికృష్ణ, సామేలు, కల్యాణ్, జహంగీర్, శివప్రసాద్, సూర్యప్రకాశ్, ఆర్య, హిమకిరణ్, సమీర్ బిన్ మహ్మద్ సిద్దిఖ్, లక్ష్మణ్‌గౌడ్, ప్రేమ్‌కుమార్, కోచ్ మీర్ వాజిద్ అలీ, మేనేజర్ రాజేందర్.


మెయిన్ స్టేడియంలో ఫుట్‌బాల్ టోర్నీ ఏర్పాట్లను పరిశీలిస్తున్న అసోసియేషన్ ప్రతినిధులు

విజయవంతంగా నిర్వహిస్తాం



జిల్లా అసోసియేషన్ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి సీనియర్ ఫుట్‌బాల్ టోర్నీ నిర్వహిస్తున్నాం. క్రీడాకారులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా తగిన సౌక ర్యాలు ఏర్పాటు చేస్తున్నాం. అందరి సహకారంతో రాష్ట్రస్థాయి టోర్నీని విజయవంతంగానిర్వహిస్తాం.

– ఎన్‌పీ.వెంకటేశ్, అధ్యక్షుడు జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్

సంతోషంగా ఉంది



జిల్లా కేంద్రంలో రాష్ట్రస్థాయి సీనియర్ ఫుట్‌బాల్ టోర్నీ నిర్వహిస్తున్నందుకు చాలా సంతోషంగా ఉంది. జిల్లాలో మూడో సారి రాష్ట్రస్థాయి సీనియర్ పురుషుల ఫుట్ బాల్ టోర్నీ జరుగుతోంది. క్రీడా కారులకు వసతి సౌకర్యం కల్పించినందుకు అసోసియేషన్ తరఫున పాఠశాలల యాజమాన్యాలకు ధన్యవాదాలు.

– భానుకిరణ్, ప్రధాన కార్యదర్శి, జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్